క్లుప్తంగా

జోరు వాన



చిత్తూరులో కురుస్తున్న వర్షం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం, మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం జోరు వాన కురిసింది. బలమైన గాలితోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అర్ధగంట పాటు కురిసిన వర్షానికి రోడ్లంతా జలమయమయ్యాయి. ఈ వర్షం వేసవి దుక్కులకు అనుకూలమని రైతులు చెబుతున్నారు.

తగ్గిన రిజిస్ట్రేషన్లు



ఖాళీగా ఉన్న చిత్తూరు అర్బన్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గంగజాతర..దీంతో పాటు మంగళవారం సెంటిమెంట్ మూలాన రిజిస్ట్రేషన్లు తగ్గాయి. సాధారణ రోజుల్లో చిత్తూరు అర్బన్, రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రోజు దాదాపు 50కి పైగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. మంగళవారం కేవలం 18 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. పలువురు పండుగ అని రిజిస్ట్రేషన్లు పెట్టుకోలేదు. బుధవారం ఓ మోస్తరుగా రిజిస్ట్రేషన్లు జరగవచ్చని అధికారులు చెబుతున్నారు. కొనుగోలు, అమ్మకందారులు తగ్గడంతో కార్యాలయాలు బోసిపోయింది.

ఇసుక రీచ్ పరిశీలన



ఇసుక రీచ్‌ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె సమీపంలోని బహునదిలో ఇసుక రీచ్‌ని మంగళవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే స్థానికులు అడ్డుకుని ఫిర్యాదు చేయాలని కోరారు. జాయింట్ కలెక్టర్‌తో పాటు భూగర్భ గనుల శాఖ డీడీ కేఎల్ఎం ప్రసాద్, ఏఎస్పీ సుబ్బరాజు, జియాలజిస్టు పోలిరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ మదన్‌మోహన్, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓ ఆఫీస్ ఏఓ విజయభాస్కర్, తహసీల్దార్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలోని జీసెస్ గాస్పెల్ చర్చిలో గురువారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని పాస్టర్ ఏసు తెలిపారు. చెన్నైకు చెందిన ఎంఎన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తామన్నారు. మండలంలోని పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


విత్తన పంపిణీకి రిజిస్ట్రేషన్ రేపు

పూతలపట్టు: మండలంలో గురువారం నుంచి రైతులకు వేరుశనగ విత్తన కాయల పంపిణీకి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారి మధురవాణి ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని రైతులు వారి పరిధిలోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. 30 కిలోల వేరుశనగ బస్తా ధర రూ.1,710 చెల్లించాలని తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో మొత్తం 1,350 క్వింటళ్ల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్, పట్టాదారు పాసుపుస్తకాన్ని తీసుకొని రైతుభరోసా కేంద్రంలో సంప్రదించాలని తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి

ఐరాల: ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం అందించే వేరుశనగ విత్తన కాయల కోసం రైతులు ఈ నెల 23వ తేదీ నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యలయంలో ఆమె మాట్లాడుతూ మండలానికి 1,710 క్వింటాళ్ల కె–6 రకం సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో 30 కిలోల బస్తా రూ.1,710 ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో రైతు భరోసా కేంద్రాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

గ్యాస్ డీలర్ల సంఘ మాజీ అధ్యక్షుడు మృతి



రాజశేఖర్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఉమ్మడి జిల్లా గ్యాస్ డీలర్ల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం మృతి చెందారు. 45 ఏళ్లకు పైగా చిత్తూరులో గ్యాస్ డీలర్‌గా ఉన్న ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కన్నుమూశారు. ఆయన మృతికి జిల్లా గ్యాస్ డీలర్ల సంఘ అధ్యక్షులు కిషోర్ ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

గిరింపేటలో గంగమ్మ



కొంగారెడ్డిపల్లిలో కొలువుదీరిన గంగా భవాని



నడివీధిలో అంబలి పోస్తున్న భక్తులు



ఎలక్ట్రానిక్ పరికరంతో ఏర్పాటు చేసిన పుట్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్పీ మణికంఠ



కల్పవల్లీ.. కరుణించు గంగమ్మతల్లీ

- చిత్తూరులో అట్టహాసంగా గంగజాతర
- నడివీధితో పాటు పలుచోట్ల వేడుకగా ఉత్సవం
- విశేషంగా తరలివస్తున్న జనం
- అమ్మవారి దర్శనానికి క్యూ కడుతున్న భక్తులు
- కొనసాగుతున్న విశేష పూజలు



చిత్తూరు నడివీధి గంగమ్మ

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు గంగజాతరకు జనం పోటెత్తారు. తొలి పూజను కనులారా తిలకించారు.అంబలి, పిండివంటలు నైవేద్యం సమర్పించారు. విచిత్ర వేషధారణలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. కరుణించి..కాపాడే తల్లీ కటాక్షించమ్మా అంటూ వేడుకున్నారు. చిత్తూరు జాతరకు అశేష జనం తరలిరావడంతో గంగమ్మ..మాయమ్మా నామస్మరణలతో మండపాలు మార్మోగాయి. చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర మంగళవారం నడివీధిలో గంగమ్మ శిరస్సును కొలువుదీర్చి, విశేషాలంకరణ చేశారు. 5 గంటల ప్రాంతంలో వంశపారంపర్య ధర్మకర్తల చేతుల మీదుగా తొలిపూజ చేసి, జాతర ఘట్టాన్ని ప్రారంభించారు. ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు కర్పూర హారతులు పట్టారు. అనంతరం నిత్య కైంకర్యాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. అమ్మవారి కర్పూర హారతి, నిమ్మకాయల కోసం ఎగబడ్డారు.

పలు చోట్ల..

చిత్తూరు నగరం దొడ్డిపల్లెలో కూడా గంగజాతరను కనుల పండువగా నిర్వహించారు. తొలుత డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి శిరస్సును స్థానిక వీధుల్లో ఊరేగించారు. ఈ ఊరేగింపులో భాగంగా గంగమ్మ తల్లీ ఇంటింటా పూజలందుకున్నారు. అనంతరం నడివీధిలో కొలువుదీర్చి..తొలిపూజ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సతీమణి ఇందుమతి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కుకున్నారు. అక్కడి జాతర పెద్దలు ఆమెకు అమ్మవారి దర్శనం కల్పించి, కర్పూర హారతి అందించారు. అనంతరం శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సునీత, నాయకులు దొడ్డిపల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

- గిరింపేట గంగజాతరకు జనం అశేషంగా తరలివచ్చారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తొలిపూజ చేశారు. ఉదయం 6 గంటలకు తొలిపూజ పూర్తి కాగానే అమ్మవారి దర్శనార్థం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో మండపం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి అంబిలి పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా జాతర పెద్దలు చర్యలు తీసుకున్నారు.
- సంతపేట గంగజాతర వైభవంగా జరిగింది. సంతపేట జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ భూపేష్ గోపినాథ్ గజమాల సమర్పించి, జాతరను ప్రారంభించారు. ఉదయం నుంచే అమ్మవారిని తరించేందుకు భక్తులు పోటెత్తారు. వీరి రాకతో ఆ ప్రాంగణం కిక్కిరిసింది. క్యూలో నిల్చుని అమ్మవారిని దర్శించుకున్నారు. అంబలి, పిండివంటలను గంగమ్మకు నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం వరకు కూడా భక్తుల రద్దీ అలానే కొనసాగింది. మళ్లీ రాత్రి భక్తుల తాకిడి అధికమైంది. వీధి నాటకం, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- కొంగారెడ్డిపల్లెలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి జాతర లాంఛనంగా ప్రారంభించారు. ఆ తర్వాత భక్తులు గంగమ్మ కటాక్షం కోసం క్యూకట్టారు. అంబలి పోసి ఆరాధించారు. పిండివంటలు నైవేద్యం సమర్పించారు.
- నగర పాలకసంస్థ కమిషనర్ జె అరుణ గిరింపేటలోని అమ్మవారికి అంబలి పోసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆమెకు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించి, పసుపు, కుంకుమ, నిమ్మకాయలు అందజేశారు.

పోలీసులు నిఘా

జాతరలో అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు తగు చర్యలు తీసుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్‌ను మళ్లించి, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూశారు. మండపాల వద్ద పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. అన్ని చోట్ల కూడా జాతర అంచనాలు ఈసారి మించాయి. తమ ప్రాంతాల్లోని గంగమ్మ ప్రత్యేకంగా కనిపించాలనే పోటీతత్వం గట్టిగా కనిపిస్తోంది. మండపాల ఏర్పాటు నుంచి విద్యుత్‌దీపాలంకరణ, డప్పు వాయిద్యాలు, గజమాల, అమ్మవారి ప్రత్యేక అలంకరణ, అన్నదానాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ జాతరను చూసేందుకు చిత్తూరు వాసులతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి..తమిళనాడు, కర్ణాటక, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాది మంది తరలివస్తున్నారు.

సేవా కార్యక్రమాలు..

జాతర సందర్భంగా మండుటెండను దృష్టిలో ఉంచుకుని అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మజ్జిగ, శీతపానీయాలను ఉచితంగా పంపిణీ చేశారు. బజారు వీధిలో జైన్ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ, జ్యూస్ పంపిణీ చేశారు. సుమారు లక్ష మందికి మజ్జిగ, జ్యూస్ అందజేస్తున్నట్లు నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు.



అమ్మవారిని దర్శింకుంటున్న సంతపేట జాతర చైర్మన్ భూపేష్ గోపినాథ్

ఎలక్ట్రానిక్ గంగమ్మ..!

గంగజాతరను పురస్కరించుకుని చిత్తూరు నగరం సంతపేట రోడ్డులో ఎలక్ట్రానిక్ గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్ వస్తువుల సాయంతో ఈ గంగమ్మ అటు..ఇటూ ఊగుతూ కనిపించేలా తీర్చిదిద్దారు. దేవకన్యలు విండ్యా మరలు విసురుగుతున్నట్లు సెట్ చేశారు. ఈ విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

పుట్టలో..గంగమ్మోచ్చే..!

చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లెలోని గంగమ్మ మండపం వద్ద పుట్టలో నుంచి గంగమ్మ దర్శమిచ్చేలా తీర్చిదిద్దిన విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జాతరలో భాగంగా ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఉపయోగించి పుట్టపై నాగుపాము బుసకొట్టేలా సెట్ చేశారు. 5 నిమిషాల తరువాత ఆ పుట్టలో నుంచి గంగమ్మ తల్లీ ప్రత్యక్షమయ్యేలా చేశారు. ఈ విధానం ఏర్పాటు చేసిన లైట్ సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ గంగమ్మను భక్తులు ఫోటోలు తీసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

అట్టహాసంగా గంగమ్మ జాతర



అమ్మవారికి సారెను సమర్పించిన ధర్మకర్త జగదీశ్వర్‌రెడ్డి దంపతులు



అమ్మవారి వేషంలో యువతి

పూతలపట్టు: మండలంలో మంగళవారం పలు గ్రామాల్లో అట్టహాసంగా గంగమ్మ జాతర ప్రారంభమైంది. తొలుత మండల కేంద్రంలోని గంగమ్మకు ఉదయం 4 గంటలకు ధర్మకర్త పూతలపట్టు జగదీశ్వర్ ఆధ్వర్యంలో సారెను సమర్పించి, తొలిపూజతో లాంఛనంగా తెరను తొలగించారు. విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అంబలిని సమర్పించారు. గంగమ్మను దర్శించుకుని చీరలను సమర్పించుకున్నారు. సాయంత్రం విశేష పూజలు నిర్వహించి, భక్తులకు నైవేద్యాలను అందజేశారు. అమ్మవారి వేషాధారణ ధరించి పలువురు ప్రత్యేకార్షణగా నిలిచారు.

నేడు నిమజ్జనం

పూతలపట్టు మండల కేంద్రం, పలుచోట్ల ఏర్పాటు చేసిన గంగమ్మ విగ్రహాలను బుధవారం సాయంత్రం నిమజ్జనం చేస్తున్నట్లు ధర్మకర్త జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. అమ్మవారికి గజమాలను సమర్పించి, పురవీధుల్లో ఊరేగిస్తారని తెలిపారు. ఊరేగింపు అనంతరం చెరువులో నిమజ్జనం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బాబురెడ్డి, మల్లికార్జునశెట్టి, చిట్టిరెడ్డి, జేజిరెడ్డి,రాజేంద్రరెడ్డి, తులసి, జీవరత్నం, అమర్‌నాథ్, కో–ఆప్షన్ సభ్యుడు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.










సంతపేట రోడ్డులో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ గంగమ్మ, సంతపేట మండపం వద్ద క్యూకట్టిన భక్తులు, అమ్మవారికి అంబలి తీసుకొస్తున్న మహిళలు, పుట్టలో నుంచి దర్శనమిస్తున్న గంగమ్మ, వేషధారణలో భక్తులు

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌సుందర్‌రాయల్ రెడ్డి

తవణంపల్లె: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, ఆ దిశగా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని తవణంపల్లె ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి, పరిష్కరించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. వర్షాకాలంలో కరెంటు తీగలు తెగిపడి ప్రమాదాలు జరగకుండా విద్యుత్‌శాఖ అధికారులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు భారతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులపై ప్రజలు తమకు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీల్లోని సమస్యలను గుర్తించి, పరిష్కరించాలని, మీపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ప్రజలకు సేవలందించాలని ఆదేశించారు. వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ మాట్లాడుతూ మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 1,710 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. మండలంలో రీసర్వే చేసిన గ్రామాల్లో 1–బి ఆన్‌లైన్‌లో రావడంలేదని దీనిని దృష్టిలో ఉంచుకుని సాగు చేసే ప్రతి రైతుకు విత్తనాలు ఇవ్వాలని సర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, సభ్యులు డిమాండ్ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ మోహన్ వేలు మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారికి టీబీ నివారణలో భాగంగా బీసీజీ వ్యాక్సిన్లు వేస్తున్నట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఈశ్వర్ మాట్లాడుతూ మండలంలో 35 వాటర్ ట్యాంకు పనులు వివిధ దశల్లో జరుగుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, ఐరాల సీడీపీఓ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



హాజరైన సభ్యులు

గంగమ్మ సేవలో సునీల్‌కుమార్



పూజా కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్

బంగారుపాళెం: మండలంలోని తిమ్మోజుపల్లె దళితవాడలో కొలువుదీరిన గంగమ్మను మంగళవారం రాత్రి వైఎస్సార్ సీపీ పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ దర్శించుకున్నారు. గంగమ్మ జాతరలో భాగంగా స్థానికుల ఆహ్వానం మేరకు ఆయన తిమ్మోజుపల్లెకు విచ్చేశారు. ఈ సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అమరావతి

బంగారుపాళెం: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంపీపీ అమరావతి సూచించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న కారణంగా ప్రధాన సమస్యలపైన చర్చ సాగింది. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు సమావేశంలో సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను అధికారులు తమ పరిధిలో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, జయకుమార్, కురబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అమరనాథ్, ఎంపీడీఓ శివశంకర్, తహసీల్దార్ సుబ్రమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకే వైద్యం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల చెంతకే ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 80 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. ఇళ్లకే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న సంపూర్ణ పోషణ పథకాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిత్తపారలో 'ఫ్యామిలీ డాక్టర్'

గుడిపాల: ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి చంద్రమహేష్ కోరారు. మండలంలోని చిత్తపార మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం మంచానికే పరిమితమైన దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వారిని పరీక్షించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంధ్య, చంద్ర, హేమలత, మంజుల, ఇందుమతి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించాలి

తవణంపల్లె: వర్షాకాలంలో వ్యాధులు సోకకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని దిగువమత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు, గర్భిణులు, బాలింతలకు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, తులసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జాహ్నవి, డీఈఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.



ఐరాల: పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది




తవణంపల్లె: దిగువమత్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, గుడిపాల: వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ చంద్రమహేష్

సత్యమ్మకు భక్తిశ్రద్ధలతో పూజలు



విశేషాలంకరణలో సత్యమ్మ తల్లి

తవణంపల్లె: మండల కేంద్రంలో మంగళవారం సత్యమ్మ తల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో అభిషేకం, పూజలు చేశారు. పసుపు, కుంకుమ, సుగంధ పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అమ్మవారికి అంబళ్లు పోశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టారు. నడివీధిలో గంగమ్మ తల్లిని భక్తితో ప్రతిష్టించారు. అమ్మవారికి దీపధూప నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం అమ్మవారికి పూజలు చేసి, నిమజ్జనం చేస్తామని నిర్వాహకులు తెలిపారు.